



కష్టాలు కన్నీరై ప్రవహిస్తుంటే.. నష్టాలు నానాటికీ పెరిగిపోతుంటే.. ఏమీ చేయలేక, ఎటువైపు వెళ్లాలో దారితోచక దిక్కులు చూస్తూ వరద బాధితులు చేస్తున్న ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. కనికరం లేని వరద ఇష్టానురీతిన తుడిచి పెట్టుకుపోతే, కకావికలమైన బతుకులు కన్నీరు తుడుచుకుని మరమ్మతుల పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఎంత కష్టించినా తొలగని బురద, ఎంత వెతికినా కనిపించని వస్తువులు, నామరూపాలు కోల్పోయిన ఇళ్లను చూసుకుంటూ జీవితాలను మళ్లీ మొదలుపెడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ, కండ్రిక, పాయకాపురం, అంబాపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. కొన్ని వీధుల్లో ఇంకా వరద నీరు ఉండటంతో బాధితులు బిక్కుబిక్కుమంటూనే జీవిస్తున్నారు. పారిశుధ్య కార్మికుల చేయూత, అగ్నిమాపక సిబ్బంది సహకారం, దాతల దాతృత్వం బాధితులకు కాస్త చేదోడుగా నిలుస్తోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



కకావికలం

దిక్కుతోచని స్థితిలో వరద బాధితులు

- కొన్ని ప్రాంతాల్లో ఇంకా తొలగని నీరు
- మురుగు నీటిలోనే ఉండిపోయిన కొందరు
- బురదతో సహవాసం చేస్తున్న ఇంకొందరు
- ఎంత శుభ్రం చేస్తున్నా తొలగని మురుగు
- అస్తవ్యస్తంగా మారిన పరిసరాలతో అవస్థలు
- రెండు వారాలవుతున్నా చక్కబడని పరిస్థితి

డ్రెయినేజీ కాదు.. ఇల్లే..! : కబేళాలో ఓ ఇంటి పరిస్థితి ఇలా..



క్యూ : సింగ్‌నగర్ డంపింగ్ యార్డు వద్ద బారులుతీరిన చెత్తతో నిండిన వాహనాలు



ఆరని వేదన.. తీరని యాతన : సామాన్లు శుభ్రం చేస్తూ..



బ్యాంకంతా బయటకు : పాయకాపురంలో..



సర్వం నాశనం : కబేళాలో ఓ కుటుంబం కష్టాలు



కె.కొత్తపాలెం వద్ద వరద నీటిలో మునిగిపోయిన పాఠశాల (ఇన్‌సెట్‌లో) తడిసిపోయిన పుస్తకాలను ఆరబెట్టుకుంటూ..

జలపాఠాలు

నిండామునిగిన విద్యాలయాలు, విద్యార్థులు

- కొట్టుకుపోయిన పుస్తకాలు, యూనిఫాంలు
- అవనిగడ్డ నియోజకవర్గంలో పరిస్థితి దారుణం
- పుస్తకాలు లేకుండా పాఠాలు ఎలా.. అనే ప్రశ్న
- ఇంకా ఏ నిర్ణయం తీసుకోని విద్యాశాఖ

> విద్యానిలయాలు వరదల్లో చిక్కుకున్నాయి. విద్యార్థులు కూడా వరద బాధితులుగా రోడ్డున పడ్డారు. పుస్తకాలు పోగొట్టుకుని, యూనిఫాంలు చేజార్చుకుని కన్నీటిపర్యంత మవుతున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలోని దాదాపు 15 లంక గ్రామాల్లో విద్యార్థుల పుస్తకాలు, యూనిఫాంలు కొట్టుకుపోవడం, విద్యార్థులకు అందించే సహకారంపై ఇప్పటివరకు విద్యాశాఖ ఎటువంటి నిర్ణయం తీసుకోక పోవడంతో ఈ విద్యా సంవత్సరం ప్రశ్నార్థకంగా మారింది.

అవనిగడ్డ, సెప్టెంబరు 13 : దివి ప్రాంతంలోని మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లోనే దాదాపు 12 ప్రైమరీ, యూపీ పాఠశాలలు నీటమునగగా, వాటి పరిధిలోని గ్రామాల్లోకి కూడా నీరు చేరింది. వరద నీరు ఒక్కసారిగా చొచ్చుకురావటంతో విద్యార్థుల పుస్తకాలు మునిగిపోయాయి. కొన్నిచోట్ల కొట్టుకుపోయాయి. మోపిదేవి మండలం కె.కొత్తపాలెం, బొబ్బర్లంక, బొబ్బర్లంక పల్లెపాలెం, అవనిగడ్డ మండలం పులిగడ్డ, రేగుళ్లంక, పులిగడ్డ పల్లెపాలెం, దక్షిణ చిరువోలులంక, ఒడుగువారిపాలెం, అయ్యవారిపాలెం, మేడిలంక, దక్షిణ చిరువోలులంక ఎస్సీ కాలనీల పరిధిలోని 12 పాఠశాలల్లో చదివే దాదాపు 200 మంది విద్యార్థుల పుస్తకాలు ఎందుకూ పనికి రాకుండాపోయాయి. అవనిగడ్డ, మోపిదేవిల్లో చదివే దాదాపు 20 మందికిపైగా పదో తరగతి, ఆపై తరగతులు చదివే వారి పుస్తకాలు కూడా వరదల్లో పాడైపోయాయి. తన మనమరాలి సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయని కె.కొత్తపాలెంలోని ఓ వృద్ధురాలు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పర్యటనలో బోరున విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది. అయితే, పుస్తకాలు పాడైపోయిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వారికి పుస్తకాలు ఎలా సమకూర్చాలో అర్థంకాక విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కదిలించిన పవిత్ర వీడియో



పవిత్ర, రేగుల్లంక

తన పుస్తకాలన్నీ పూర్తిగా తడిచిపోయాయని, యూనిఫాం కూడా వరదల్లో కొట్టుకుపోయిందని అవనిగడ్డ మండలం రేగుల్లంక గ్రామానికి చెందిన పవిత్ర అనే 9వ తరగతి విద్యార్థిని పెట్టిన వీడియో దివి ప్రాంతాన్ని కదిలించింది. పవిత్ర ఇంట్లోని సామాగ్రి మొత్తం కొట్టుకుపోగా, ఆ కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఆమె తన దుస్థితిని వివరిస్తూ పెట్టిన వీడియోకు స్పందించిన అనేకమంది పవిత్రతో పాటు అత్యంత పేదరికంగా ఉన్న మరికొందరు విద్యార్థులకు కూడా సాయమందించారు. అయితే, జిల్లా విద్యాశాఖ నుంచి పుస్తకాలు వస్తే కానీ, తామేమీ చేయలేమని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కొందరు విద్యార్థులకు ఉపాధ్యాయులే కొనుగోలు చేసి ఇస్తున్నారు. కానీ, ఒక్కో విద్యార్థికి పది నోట్ పుస్తకాలు అవసరమవుతాయని, దాతలు ముందుకొచ్చి వాటిని సమకూర్చితే ప్రభుత్వం నుంచి పాఠ్య పుస్తకాలు ఇప్పించుకోగలమని పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



లోకేశ్‌తో జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నెట్టెం రఘురాం తదితరులు

పేట మునిసిపాలిటీ టీడీపీ వశం

పార్టీలో చేరిన మునిసిపల్ చైర్మన్

- లోకేశ్ సమక్షంలో చేరిక
- మరో ముగ్గురు కౌన్సిలర్లు కూడా..
- కౌన్సిల్‌లో టీడీపీ బలం 18, వైసీపీకి 13

జగ్గయ్యపేట, సెప్టెంబరు 13 : జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో రాఘవేంద్రతో పాటు 7, 23, 31 వార్డుల కౌన్సిలర్లు పూసపాటి సీతారావమ్మ-పుల్లారావు, డి.రమాదేవి-రామకృష్ణ, గింజుపల్లి వెంకట్రావును పార్టీలో చేర్చుకున్నారు. వైసీపీకి చెందిన ఈ నేతల చేరికతో జగ్గయ్యపేట మునిసిపాలిటీలో టీడీపీ మెజారిటీ పక్షంగా అవతరించింది. గతంలో వైసీపీకి పదిహేడు, టీడీపీకి పద్నాలుగు కౌన్సిలర్ల పదవులు ఉండేవి. తాజా చేరికలతో కౌన్సిల్‌లో టీడీపీ బలం పద్దెనిమిదికి పెరగగా, వైసీపీ బలం పదమూడుకు తగ్గింది. ఈ చేరిక కార్యక్రమంలో జగ్గయ్యపేట టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కూడా పాల్గొన్నారు. వారితో లోకేశ్ కొద్దిసేపు మాట్లాడారు. 'రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంతగా ఒకేసారి భారీ వర్షాలు కురిశాయి. ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచింది. వరదలోనూ జగన్‌రెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నారు' అని విమర్శించారు. అనంతరం శ్రీరాం తాతయ్య మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'తాజా చేరికలతో జగ్గయ్యపేట మునిసిపాలిటీ టీడీపీ వశమైంది. వైసీపీ విధానాలు నచ్చక చాలామంది ఆ పార్టీని వీడుతున్నారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా ఆ పార్టీ వీడతారనే ప్రచారం జరుగుతోంది. అది ఆయన వ్యక్తిగత నిర్ణయం' అని శ్రీరాం తాతయ్య అన్నారు. మునిసిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇటీవలి వరదల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషికి ఆకర్షితుడనై టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని విశ్వసిస్తున్నానన్నారు. వారి వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ యలమంచిలి రాఘవ, టీడీపీ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, వేదులాపురి అలేఖ్య, సంధ్యారాణి, గీతారాణి, పేరం సైదేశ్వరరావు, గొట్టి నాగరాజు, నకిరికంటి వెంకట్ తదితరులు తరలివెళ్లారు.

వరద బాధిత జిల్లాగా 'ఎన్టీఆర్'

రెవెన్యూ శాఖ ఉత్తర్వులు విడుదల

విజయవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాను పూర్తి వరద ప్రభావిత జిల్లాగా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గడిచిన నెల 30, 31 తేదీల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఆ రెండు రోజుల్లో 48 గంటల్లోపు 30 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షాల కారణంగా అటు కృష్ణానదికి రికార్డు స్థాయిలో 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. మరోపక్క బుడమేరుకు భారీ వరద వచ్చింది. నగరంలోని 32 డివిజన్లు పూర్తిగా నీట మునిగాయి. 2లక్షల మంది బాధితులయ్యారు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో కేంద్రం నుంచి నిధులు ఎక్కువ విడుదలయ్యే అవకాశాలున్నాయి.

బదిలీలు

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఇష్టానుసారంగా జాబితాలు

- డబ్బు ముట్టజెబితే చాలు కోరుకున్న స్థానానికి బదిలీ
- ఐదేళ్లు దాటిన వారు బదిలీ కాకుండా పన్నాగాలు
- ఇన్‌చార్జి పీడీని పక్కదారి పట్టించి కుట్రలు
- కొందరు అధికారులు, సిబ్బంది చేతివాటం



డీఆర్‌డీఏ కార్యాలయం

> జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో ఉద్యోగుల బదిలీలు వివాదాస్పదంగా మారుతున్నాయి. కొందరు అధికారులు ఇష్టానుసారంగా జాబితాలను తయారుచేస్తూ రూ.లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ ఐదు నెలల కిందట పదవీ విరమణ చేశారు. ఈ పోస్టులో రెగ్యులర్ అధికారిని నియమించలేదు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్‌ను ఇన్‌చార్జి పీడీగా నియమించారు. ఎన్నికలు, డీపీవో కార్యాలయ విధుల్లో బిజీగా ఉన్న ఆయన డీఆర్‌డీఏలో ఏం జరుగుతోందో పట్టించుకోవట్లేదు. దీంతో ఇక్కడి అధికారులు తమ చిత్తానుసారం వ్యవహరిస్తున్నారు. తమ ఇష్టంగా ఫైళ్లను సిద్ధంచేసి డీఆర్‌డీఏ పీడీ వద్దకు తీసుకెళ్లి సంతకాలు చేయిస్తున్నారు. అలాగే, పరిపాలనకు సంబంధించిన వ్యవహారాలన్నీ కార్యాలయంలో పనిచేసే అధికారులు, సిబ్బంది కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. స్త్రీనిధి, డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరు తదితర అంశాలన్నీ కిందిస్థాయి సిబ్బందే చూసుకుంటున్నారు.

బదిలీల్లో చేతి'వాటాలు'

అన్ని శాఖలతో పాటే డీఆర్‌డీఏలోనూ ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 75 మంది కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు (సీసీలు), మరో 75 మంది అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎం).. మొత్తంగా 150 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే, బదిలీ జాబితాలను తయారుచేసే సమయంలో కార్యాలయంలో పనిచేసే అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తమను ప్రసన్నం చేసుకున్న వారిని కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేస్తున్నారు. ఐదేళ్ల పాటు ఒకే మండలంలో పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. బదిలీ కోరుకున్న సీసీలు, ఏపీఎంలు పాతమండలంలో పనిచేయడానికి అవకాశం లేదు. జాబితాలు తయారుచేసే సమయంలో హెచ్‌ఆర్‌ఎంఎస్ సైట్‌లో వివరాలు పొందుపరచాలి. ఉద్యోగులు ఎప్పుడు విధుల్లో చేరారు, ఎంతకాలంగా, ఏ మండలంలో పనిచేస్తున్నారు.. తదితరాలు తెలియజేయాలి. ఐదేళ్లు దాటి ఒక్కరోజు గడిచినా, సదరు ఉద్యోగిని తప్పనిసరిగా బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను పక్కనపెట్టి, ఏవేవో కారణాలు చూపి.. కొంతమంది ఉద్యోగుల పేర్లను బదిలీల జాబితా నుంచి తప్పించారు. దీని వెనుక నగదు చేతులు మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇన్‌చార్జి పీడీకి విషయం తెలియకుండా జాబితా తయారు చేశారని, జాబితాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని సీసీలు, ఏపీఎంలు బాహాటంగానే చెబుతున్నారు. జాబితాలపై కొందరు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో ఇప్పటికే రెండుసార్లు బదిలీల ప్రక్రియ వాయిదా పడింది.

సీసీకి ఏపీఎంగా పదోన్నతి ఇవ్వాలని ఒత్తిడి

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం మండలంలో వెలుగు ప్రాజెక్టుకు సంబంధించి రెగ్యులర్ ఏపీఎం లేరు. వేరే మండలం నుంచి ఒక ఏపీఎంను ఇన్‌చార్జిగా కొనసాగిస్తున్నారు. ఇదే అదనుగా భావించి మండలంలో సీసీగా పనిచేస్తున్న ఒక ఉద్యోగి తనకు ఏపీఎంగా పదోన్నతి ఇవ్వాలని తెరవెనుక ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. పదేళ్లుగా సీసీగా పనిచేస్తున్న ఈ ఉద్యోగి ప్రస్తుతం జరిగే బదిలీల్లో తప్పనిసరిగా వేరే మండలానికి బదిలీ కావాలి. అయితే, ఈ ఉద్యోగి పేరును ప్రస్తుతం జరిగే బదిలీల జాబితాలో చూపకపోవడం వెనుక కారణాలు ఏమై ఉంటాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఏపీఎంగా నియమించాలంటే కనీసం పీజీ విద్యార్హత ఉండాలని, పదో తరగతే చదివిన ఈ ఉద్యోగికి ఎలా పదోన్నతి ఇస్తారని ప్రశ్నలు వస్తున్నాయి. గతంలో ఈ ఉద్యోగి డ్వాక్రా సంఘాల ద్వారా ధాన్యం కొన్న సమయంలో కమీషన్ రూపంలో వచ్చిన నగదు, గ్రామైఖ్య సంఘం నిధులు, స్త్రీనిధి నగదును కాజేయడంతో పాటు నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో రుణాలు తీసుకుని మొత్తంగా రూ.1.50 కోట్లకు పైగా పక్కదారి పట్టించాడనే ఫిర్యాదులున్నాయి. దీనిపై విచారణను వైసీపీ ప్రభుత్వ హయాంలో పక్కన పెట్టేశారు. అప్పట్లో విచారణాధికారిగా ఉన్నవారే ప్రస్తుతం ఈ సీసీకి పదోన్నతి ఇచ్చేందుకు ఫైలు సిద్ధం చేశారని ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ సీసీకి పదోన్నతి ఇప్పించేందుకు, మచిలీపట్నం మండలంలోనే కొనసాగించేందుకు పాలకులను కూడా పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని కూటమి నాయకులు చెబుతున్నారు. అలాగే, ఈ సీసీ.. నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో ఇటీవల రూ.30 లక్షల వరకు రుణాలు ఇప్పించేందుకు ప్రయత్నించిందని, ఈ అంశంపై విచారణ చేస్తే అసలు నిజాలు బయటకొస్తాయని డీఆర్‌డీఏ కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు.

దసరా ఏర్పాట్లకు సన్నద్ధం కావాలి

6లో.. **ఆపరేషన్ బుడమేరుకు ప్రాధాన్యం**



రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సారథి, ఎమ్మెల్యే గద్దె

బుడమేరుకు వరద నివారణ చర్యలు

- ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీలో మంత్రి సారథి

కృష్ణలంక, సెప్టెంబరు 13 : భవిష్యత్తులో బుడమేరుకు వరద పోటు రాకుండా ఏమి చేయాలనే అంశంపై ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నదని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం కృష్ణలంక 21వ డివిజన్‌లో రణదీవెనగర్ కరకట్ట వద్ద వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు మంత్రి పాల్గొని నిత్యావసర వస్తువులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృష్ణానది, బుడమేరుకు వచ్చిన వరదల వల్ల నష్టపోయిన వారికి నూజివీడు నియోజకవర్గంలోని సింకొల్లు గ్రామస్థులు నిత్యావసరాలను పంపిణీ చేయడానికి ముందుకు వచ్చారన్నారు.

కృష్ణా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసినా కొన్ని లీకుల వల్ల ఇళ్లు మునగడం జరిగిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అండగా వుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు. బుడమేరుకు భవిష్యత్తులో వరద రాకుండా ఏవిధంగా చేయాలనే ఆలోచనలను ప్రభుత్వం చేస్తోందని మంత్రి చెప్పారు. కృష్ణలంక రిటైనింగ్ వాల్ వద్ద ఇసుక వుండటం వల్ల నీరు ఇంకి ఇళ్ల వైపునకు వస్తోందని, వరదలు వచ్చినప్పుడు నీటిని పంపింగ్ చేయడానికి ప్రత్యేకంగా పంపింగ్ స్టేషన్లు అవసరమని గుర్తించామని, వాటిని కూడా నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. కార్యక్రమంలో బొప్పన భవకుమార్, గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కొప్పూరి కిరణ్ బాబు, కేశనం భావన్నారాయణ, పోడూరి పవన్‌కుమార్, గుండు శ్రీను, కొర్రా అప్పన్న, పోతిరెడ్డి వెంకటరమణ, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నాగులూరు చెరువుకు పడిన గండ్లను పరిశీలిస్తున్న దేవినేని ఉమా

నీటి సంఘాలను నిర్వీర్యం చేసిన జగన్

- మాజీమంత్రి ఉమా

రెడ్డిగూడెం, సెప్టెంబరు 13 : గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ రెడ్డి నీటి సంఘాలను నిర్వీర్యం చేయడం వల్లే ఇంతటి ఘోరాలు చూడాల్సి వచ్చిందని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. నాగులూరులో చెరువులకు పడిన గండ్లను ఆయన శుక్రవారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. గత వైసీపీ పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. బుడమేరును ఇష్టానుసారంగా కబ్జా చేయడం వల్ల వేల ఎకరాల్లో పంటలు పాడయ్యాయన్నారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో మంచి వారిని ఎన్నుకొని చెరువులను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ముప్పిడి నాగేశ్వర రెడ్డి, బొమ్మన కోటేశ్వరరావు, కామిశెట్టి వెంకట నరసయ్య, పైడిమర్ల కిరణ్‌కుమార్ రెడ్డి, చీపు వెంకటేశ్వరరావు, కొలుసు చిన్ని, మల్లాది పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు వస్త్రాలను అందజేస్తున్న కలెక్టర్

స్వచ్ఛంద సేవ అభినందనీయం : కలెక్టర్ సృజన

కృష్ణలంక: ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పది రోజులపాటు ముంపు బాధితులకు నిరంతర సేవలు అందించడంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది చేయూతనివ్వడం అభినందనీయమని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలకు నూతన వస్త్రాల కిట్లను శుక్రవారం కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ, ముంపు బాధితులకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ జి.ఉమాదేవి మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల సహకారంతో బాధితులకు చీర, దుప్పటి, లుంగీ, టవల్, నైట్‌డ్రస్, శానిటరీ నాప్‌కిన్స్‌లతో కూడిన రూ.లక్ష విలువైన కిట్లను 500 కుటుంబాలకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జేసీ నిధి మీనా, విశ్రాంత ఉద్యోగులు ఆర్.సూయజ్, కె.సుహాసినీదేవి, ఆర్.ఎల్.అన్నపూర్ణాదేవి, కె.కృష్ణకుమారి, సీడీపీవోలు జి.మంగమ్మ, పి.నాగమణి, ఏసీడీపీవో జ్యోత్స్న, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



బొబ్బర్లంక బాధితులకు తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ

వరద బాధితులకు తానా వితరణ

మోపిదేవి/లబ్బీపేట, సెప్టెంబరు 13 : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, తానా ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు శుక్రవారం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. బొబ్బర్లంక గ్రామంలోని 200 బాధిత కుటుంబాలకు ఐదు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ గోధుమ పిండి, ఆయిల్ ప్యాకెట్లతో కలిపి పదిరకాల నిత్యావసరాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, కృష్ణానది వరద ప్రభావిత ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన ఆరు వేలమంది బాధితులకు సహయం అందించిన తానా ఫౌండేషన్ చైర్మన్ వల్లేపల్లి శశికాంత్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కె.కొత్తపాలెం దళితవాడలో డిల్లీలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రావణ కుమార్ ఆర్థిక సహకారంతో కాజ గ్రామానికి చెందిన ప్రసాద్, వేముల అన్విత, వేముల అద్విత్‌లు 150 కుటుంబాలకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, టీడీపీ గ్రామ అధ్యక్షులు దొప్పలపూడి జగదీష్, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి బీవీ రావు, వేమూరి వెంకటరావు, స్వచ్ఛంద కార్యకర్తలు శశికళ, సోనీబాబు, సుకన్య, దివ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు దుస్తులు అందజేస్తున్న నేతలు

ఎన్టీఆర్ జిల్లా బీజేపీ జిల్లా కార్యాలయంలో అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, తదితరులు తానా ఫౌండేషన్ చైర్మన్ వల్లేపల్లి శశికాంత్ సహకారంతో దుస్తులను ముంపు బాధితులకు అందజేశారు.

దసరా ఏర్పాట్లకు సన్నద్ధం కావాలి



- అన్ని శాఖల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో సీపీ, వీఎంసీ కమిషనర్, దుర్గగుడి ఈవో తదితరులు

వన్‌టౌన్, సెప్టెంబరు 13 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. దసరా మహోత్సవాల నిర్వహణపై కలెక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, మునిసిపల్, రెవెన్యూ, పోలీస్, ట్రాఫిక్, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేవస్థానంలో ప్రతీఏటా జరిగే దసరా ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు తరలివస్తారన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. స్నాన ఘాట్లు, క్యూలైన్లు, కౌంటర్లు, ఇతర రద్దీ, ముఖ్యమైన ప్రదేశాలలో నిరంతరం నిఘా ఉంచుతున్నట్టు తెలిపారు. దుర్గగుడి ఈవో మాట్లాడుతూ, దసరా నవరాత్రులలో అమ్మవారికి చేసే అలంకారాలను వివరించారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రసాదం, కళ్యాణ కట్ట కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. స్నాన ఘాట్లు, తాగునీరు, శానిటేషన్, సెక్యూరిటీ ఏర్పాట్లు రద్దీకి అనుగుణంగా క్యూల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టామని తెలిపారు. మునిసిపల్, పోలీస్, అగ్నిమాపక, వైద్య, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, ఇతర విభాగాల ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

16న క్షేత్రస్థాయిలో సమావేశం

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 16న క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులతో కలిసి దేవస్థానంలో చేపట్టిన పనులు పరిశీలించి అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో డీసీపీలు గౌతమ్ శాలి, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, డీఈవో లీలాకుమార్, ఏఈవోలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ బుడమేరుకు ప్రాధాన్యం

- ఆక్రమణలపై నివేదికలివ్వండి
- సర్వే నెంబర్ల వివరాలను సమర్పించండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 13 : భవిష్యత్తులో బుడమేరు ముంపు నుంచి శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఆపరేషన్ బుడమేరు'కు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో సర్వే, ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్, వీఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి సర్వే నెంబర్లతో సహా ఆక్రమణలకు సంబంధించి పూర్తి నివేదిక సత్వరం సమర్పించాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. ఇందులో భాగంగా ఆక్రమణలకు గుర్తింపునకు తొలిదశలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ శుక్రవారం సర్వే, భూ రికార్డులు, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల బుడమేరు పరీవాహక ప్రాంతంలో కురిసిన దాదాపు 40 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో గండ్ల ద్వారా వచ్చిన నీటితో పరిసర లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం కావడంతో పాటు నగరంలోని రెండులక్షలకు పైగా కుటుంబాలు ముంపుతో తీవ్రనష్టాన్ని చవిచూడటం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు 'ఆపరేషన్ బుడమేరు'ను ప్రకటించారని, ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించిన నివేదికలను రూపొందించాల్సిన అవసరముందన్నారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆక్రమణలు తొలగింపునకు శ్రీకారం చుట్టనుందని, ఈ నేపథ్యంలో ఆక్రమణల వాస్తవ వివరాలను సర్వే నెంబర్లతో సహా సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఆక్రమణలపై నివేదిక రూపొందించాలని సూచించారు. వరద నీరు ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేందుకు ఆక్రమణల తొలగింపుతో పాటు పూడిక తీయడం, బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండి పడకుండా కట్టను పటిష్టపరచడం కూడా కీలకమని, వీటికి సంబంధించి ఇప్పటికే పనులు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బీమా క్లెయిమ్‌లు చేసుకోవచ్చు

విజయవాడ లీగల్ : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం శని, ఆదివారాల్లోనూ పనిచేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన, దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లు, దుకాణాలతో పాటు చిన్న, మధ్యతరహా వ్యాపారసముదాయాల వంటి ఆస్తులకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ఈనెల 9 నుంచి నిరాటంకంగా సేవలందిస్తోందని, బీమా సంస్థల ప్రతినిధులు ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో వుంటారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి

- కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతాకమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలు జరిగే అన్ని ప్రాంతాలను గుర్తించి అక్కడ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరిగే ప్రాంతాలను తెలియజేసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. బుడమేరు వరదముంపు ప్రాంతాల్లో వరదతాకిడికి పాడైన ద్విచక్రవాహనాల రిపేర్లకు డీలర్లతో మాట్లడి స్పేర్‌పార్టులు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాలు నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే అంశంపై అవగాహన కల్పించి అక్కడికక్కడే వాహనదారులు హెల్మెట్ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఎస్వీడీ ప్రసాద్, జాతీయరహదారుల అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, ఆర్అండ్‌బీ విభాగం ఈఈ శ్రీనివాసరావు, ఎంపీఐ ఎండీఎల్ సిద్దిక్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి ఐదు లక్షలు



పెనమలూరు : ముంపు ప్రాంత బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కొర్రపాటి సాయిరోహిత్ ఐదు లక్షల చెక్కును శుక్రవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. చెక్కును అందించిన సాయిరోహిత్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

సహాయ చర్యలపై ప్రజల్లో సంతృప్తి

- మంత్రి నారాయణ



వన్‌టౌన్, సెప్టెంబరు 13 : ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో తుఫాను సహాయక చర్యల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. శుక్రవారం మంత్రిని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. సెంట్రల్ నియోజకవర్గం సింగ్‌నగర్‌లో వరదల అనంతరం జరిగిన సహాయ కార్యక్రమాలు, పునర్నిర్మాణాన్ని గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సింగ్‌నగర్ ప్రాంతంలో 1965 తరువాత ఇలాంటి వరద రాలేదని, దీనివల్ల తీరని నష్టం ఏర్పడిందన్నారు. అనంతరం సెంట్రల్ నియోజకవర్గం వరద ముంపు ప్రాంతాల్లో ప్రతిరోజు పర్యటించి తుఫాను సహాయక చర్యల్లో పాల్గొంటున్నందుకు మంత్రి నారాయణకు ఎమ్మెల్యే బొండా ఉమా కృతజ్ఞతలు తెలిపారు.

దీవుల రహదారులు పునరుద్ధరించండి



కోతకు గురైన ఎదురుమొండి - జింకపాలెం రహదారి

నాగాయలంక : కృష్ణానదికి వచ్చిన భారీ వరదలకు ధ్వంసమైన ఎదురుమొండి దీవుల రహదారులను పునరుద్ధరించాలని ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామస్థులు కోరుతున్నారు. వరదల ఉధృతికి రహదారులు దెబ్బతినటంతో ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారింది. ఎదురుమొండి - నాచుగుంట రహదారి ఏడు కిలో మీటర్లు ఉండగా, అందులో సుమారు రెండు కిలో మీటర్ల వరకు ధ్వంసమైందని తెలిపారు. ఎదురుమొండి నుంచి జింకపాలెం వెళ్లే రహదారి కూడా వరద ఉధృతికి భారీగా కోతకు గురైంది. కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ అధికారులతో కలిసి భారీ కోతకు గురైన ఎదురుమొండి-జింకపాలెం రోడ్డును పరిశీలించారు. ఎదురుమొండి-నాచుగుంట, ఎదురుమొండి-జింకపాలెం రహదారుల తాత్కాలిక మరమ్మతుల కోసం అంచనాలు తక్షణమే తయారు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారులు సక్రమంగా లేకపోవటంతో వాహనదారులు, ప్రజలు సదరు రోడ్లపై రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి రహదారులను మరమ్మతులు చేయాలని దీవుల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబును వివరణ కోరగా, రహదారులు దెబ్బతిన్న చోట అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.



ప్రహరీలో పాముల గుట్టలు!

గంపలగూడెం : గంపలగూడెం పటమటి దళితవాడలో కోట రజినికి చెందిన నివాస గృహ ప్రాంగణంలో 100కు పైగా పాములు కనిపించాయి. ఇంటి ప్రహరీకి కన్నం ఉండగా పాములు గుట్టలు గుట్టలు నివాసం ఏర్పరచుకున్నాయి. ఒక్కసారిగా అన్ని పాములు కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందారు. వాటిని సమాధి చేసే ప్రయత్నంలో మట్టి పోయగా.. అవి పక్కనే ఉన్న టేకు తోటలోకి జారుకున్నాయని స్థానికులు చెబుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కూచిపూడి, సెప్టెంబరు 13 : మండల పరిధిలోని పెదసనగల్లు గ్రామ పరిధిలోని అయ్యంకి వెళ్లే మార్గంలో ఊరిచివర రైసుమిల్లు సమీపంలోని పంటబోదెలో గుర్తు తెలియని మహిళ(40) మృతదేహం లభ్యమైనట్టు కూచిపూడి ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. వీఆర్వో మరీదు ఝాన్సీ ఫిర్యాదు మేరకు కూచిపూడి ఎస్ఐ సుబ్రహ్మణ్యం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఆమె సంబంధీకులు ఎవరైనా ఉంటే 08671-252333, 9440796473కి ఫోన్ చేసి తెలియజేయాలని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెడన : చెన్నూరు గ్రామసమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. నాపరాళ్ల లోడుతో ఉన్న ట్రాక్టర్ పెడన నుంచి చెన్నూరు వెళుతోంది. నాపరాళ్లపై కె.చంటి, కె.అంజనేయులు, వడ్డపల్లి శ్రీహరి (32) కూర్చున్నారు. కమలాపురం దాటిన తరువాత చెన్నూరు సమీపంలో ట్రాక్టర్ నుంచి ట్రక్కు విడిపోయి పక్కకు ఒరిగింది. చంటి, ఆంజనేయులు దూకేసి ప్రాణాలు కాపాడుకున్నారు. శ్రీహరి నాపరాళ్ల కిందపడి చనిపోయాడు. శ్రీహరి భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న రైతు విలవిల!

- వేలాది ఎకరాల్లో కోట్లలో నష్టం
- నిలువునా ఎండిపోయిన తోటలు



భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట



పనికిరాని కండెలు

కంచికచర్ల, సెప్టెంబరు 13 : భారీ వర్షాలు, వరదలకు మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న పంట అతలాకుతలమైంది. జిల్లాలో వేలాది ఎకరాల్లో తోటలు నాశనమయ్యాయి. ముదురు తోటల్లో కండెలు బూజు పట్టగా, లేత తోటలు కూడా దెబ్బతిన్నాయి. లక్షల్లో నష్టం వాటిల్లటంతో రైతులు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో మొక్కజొన్న ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగుచేశారు. దిగుబడి, మద్దతు ధర ఆశాజనకంగా ఉండటంతో ముఖ్యంగా పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్న వైపు మొగ్గుచూపటంతో పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కౌలు రూ. 15 వేలతో కలిపి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి అయింది. దిగుబడులు బాగా వస్తాయని రైతులు భావించగా.. వరదల రూపంలో ఉపద్రవం ముంచెత్తింది. ఎడతెగని వర్షాలు, ఆపై వెల్లువలా విరుచుకుపడిన వరదలకు మొక్కజొన్న తోటలు బాగా దెబ్బతిన్నాయి. ముదురు తోటల్లో కండెలు పనికిరాకుండా పోయాయి. వర్షాలకు తేమ ఆరకపోవటంతో కండెల్లో గింజలు బూజు పట్టాయి. కొన్నిచోట్ల మొలకలు కూడా వచ్చాయి. తోటలు నిలువునా ఎండిపోయాయి. లేత తోటల్లో కనపడని నష్టం జరిగింది. కండెలు వచ్చినప్పటికీ ఇంకా గింజలు పోసుకోలేదు. తోటలు ఎర్రబడ్డాయి. గింజలు అవిసిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీనికితోడు వాగులు, వంకలతో పాటుగా వైరాయేరు, కట్లేరు, మునేరు, కృష్ణానది ఉప్పొంగటం వల్ల చుట్టు పక్కల కిలోమీటర్ల పొడవున పంటలు ముంపునకు గురయ్యాయి. రోజుల తరబడి నీటిలో ఉండటం వల్ల తోటలు నిలువునా మాడిపోయినట్టుగా నల్లగా మారాయి. గింజ కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, పెట్టుబడి మొత్తం నష్టపోవాల్సి వచ్చిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల ప్రాథమిక సమాచారం ప్రకారం జిల్లాలో 3,550 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నది. ఎక్కువ విస్తీర్ణంలో పంట దెబ్బతిన్నదని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

- మాగంటి బాలకృష్ణ, నక్కలంపేట



ఈ ఏడాది ఎంతో ఆశతో సాగు చేసిన మొక్కజొన్న, పెసర భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్నాయి. లక్షల్లో నష్టపోవాల్సి వచ్చింది. ఎన్యూమరేషన్ పూర్తిచేసి, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. పంటల బీమా సొమ్ము కూడా బాధిత రైతులకు అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

ఆరుగొలనులో పశువుల దాణా పంపిణీ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 13 : వరదల వల్ల ముంపునకు గురైన బాపులపాడు మండలంలోని పాడి రైతులకు అండగా నిలచేలా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన మేరకు కామధేను ఫీడ్స్ వారు పశువుల దాణాను ఆరుగొలనులో శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామంలోని పాడిరైతుల పశువుల మేతకు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని 65 బస్తాల పశువులు దాణాను అందజేశారు. టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్, తుమ్మల బ్రహ్మాజీ పర్యవేక్షించారు.

మర్యాదపూర్వక కలయిక

సీఎం చంద్రబాబును కలిసిన దేవినేని రాజా



కంకిపాడు, సెప్టెంబరు 13 : వరద సృష్టించిన బీభత్సాన్ని ఏడు పదుల వయస్సు లోనూ సమర్థవంతంగా సీఎం చంద్ర బాబు ఎదుర్కొన్నాడని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. సచివాలయంలో శుక్రవారం సీఎం చంద్ర బాబును ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, విజయవాడలో వరద బీభత్సాన్ని సృష్టించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్‌తో పాటు స్థానిక అధికార యంత్రాంగం విశేషంగా కృషి చేసిందని కొనియాడారు. సాయం చేయక పోగా వరద తీవ్రతను పెంచేందుకు వైసీపీ నాయకులు కుట్ర

జాతీయ వాటర్‌పోలో పోటీలకు
వీఆర్ సిద్ధార్థ విద్యార్థులు

పెనమలూరు, సెప్టెంబరు 13 : తిరువనంతపురంలో ఈ నెల 18 నుంచి 22వరకు జరగనున్న 77వ జాతీయ సీనియర్ వాటర్‌పోలో పోటీలకు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు దేవి దుర్గ, మోనికలు ఎంపికైనట్లు పీడీ పోతిన రఘు తెలిపారు. వారిని వీసీ పి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఏవీ రత్న ప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్ తదితరులు అభినందించారు.

క్రమశిక్షణతో ఎదగాలి



ఉయ్యూరు జడ్పీ హైస్కూల్‌కు పరదాలు అందజేస్తున్న సుధారాణి, అన్నే రాణి

ఉయ్యూరు, సెప్టెంబరు 13 : విద్యార్థినులు క్రమశిక్షణతో ఉత్తమపౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నర్రా సుధారాణి, అన్నే రాణి అన్నారు. ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్, పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు పరదాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినులు అప్రమత్తతో మెలగాలని, చెడు సావాసాలకు దూరంగా ఉండాలన్నారు. హెచ్‌ఎం మేరీగ్రేస్, తెలుగు ఉపాధ్యాయుడు బలే ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, సెప్టెంబరు 13 : పోరంకి సెక్షన్ పరిధిలో 11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11వరకు బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంత్‌నగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, బందరు రోడ్డు, గద్దే ఆర్టీసీ కాలనీ, లక్ష్మీపురం కాలనీ, బ్రహ్మంగారి గుడి రోడ్డు, క్యాపిటల్ ఆసుపత్రి రోడ్డు, ప్రభునగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుదని గుణదల ఈఈ హరిబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుడివాడకు
భారీ వాహనాల నిలిపివేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 13 : హనుమాన్‌జంక్షన్ - గుడివాడ రహదారిలో బుడమేరు వరద ప్రస్తుతం కొంత తగ్గినందువల్ల ద్విచక్ర వాహనాలు, కార్లకు అనుమతి ఇచ్చి, భారీ వాహనాలను నిలిపివేస్తున్నట్టు తహసీల్దార్ నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరద బాధితులకు అండగా..

పెనమలూరు, సెప్టెంబరు 13 : వరద బాధితులను ఆదుకునేందుకు అనేక మంది దాతలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమ వంతు సాయం అందిస్తున్నారు. పోరంకి టీడీపీ ఓల్డ్ ఆఫీస్(ఎన్టీఆర్ కుటీరం) సభ్యులు రూ. 1,01,116 చెక్కును స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అందించారు. కానూరు కేపిటల్ ఎంపైర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ. 1,16,000, కానూరు చెందిన మానుకొండ సత్యనారాయణ రూ. 50,000 వేల చెక్కును బోడె ప్రసాద్‌కు అందజేశారు.



ఆర్థికసాయం చెక్కును బోడె ప్రసాద్‌కు అందజేస్తున్న కానూరు కేపిటల్ ఎంపైర్ ఫ్లాట్ ఓనర్స్ సభ్యులు

బాపులపాడు మండలంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వర్షాలు ఆగినా ఇంకా ముంపులోనే కొనసాగుతున్న బాపులపాడు మండలంలోని రంగయ్యప్పారావుపేట, రామన్నగూడెం, వైకుంఠలక్ష్మీపురం, ఓగిరాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను శుక్రవారం కూడా కొనసాగిస్తున్నారు. వైకుంఠలక్ష్మీపురం, రామన్నగూడెం తదితర గ్రామాల్లో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్, అవిర్నేని వెంకటేశ్వరరావు తదితర దాతల సహకారంతో బాధితులకు ఆహారం అందజేస్తున్నారు. కానుమోలు, బాపులపాడుల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని బాధితులు తమ గ్రామాలకు చేరినట్టు తహసీల్దార్ నాగభూషణం తెలిపారు.



వైకుంఠలక్ష్మీపురం పునరావాస కేంద్రంలో భోజన ఏర్పాట్లలో పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్

నిత్యావసరాలు పంపిణీ

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు రంగయ్యప్పారావుపేట పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో గురువారం కమ్మవారి ఐక్యసేవా సమితి ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు నిత్యావసరాల కిట్లను సర్పంచ్ కాకొల్లు అన్నామణి, అట్లూరి రాజశేఖర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగం శ్రీధర్, దోనె అశోక్, శ్రీనివాసరావు, ఈడ్పుగంటి రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



కానూరు ఎస్‌బీఐ కాలనీలో సామూహిక వరలక్ష్మీవ్రతంలో భక్తులు

పెనమలూరు, సెప్టెంబరు 13 : కానూరు ఎస్‌బీఐ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద గణేష్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ప్రసాద్, కే రామకృష్ణప్రసాద్, సురేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. ●**హనుమాన్‌జంక్షన్ :** స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావాధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని బాబు అరుణ దంపతులు ఉచితంగా పూజా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమాన్ని ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షించారు. ● స్థానిక నూజివీడు రోడ్డులోని కృష్ణానగర్ వాసులు నిర్వహించిన 19వ వరసిద్ధి వినాయక ఉత్సవం సందర్భంగా శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మూడు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ పందిరిలో ఏర్పాటు చేసిన ఐదు కేజీల ప్రసాదం లడ్డూకు వేలం పాట నిర్వహించగా కన్నికంటి శ్రీనివాసరావు రూ.30వేలుకు పాడారు. స్థానిక విజయవాడ రోడ్డులోని ధరణీ రెసిడెన్సీలో నిర్వహించిన గణేష్ ఉత్సవ పందిరిలో 3 కేజీల లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో వడ్డి శ్రీనివాసరావు రూ.7,200లకు పాడుకున్నారు.

లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి సేవలు ఎనలేనివి



జస్టిస్ పి.లక్ష్మణరెడ్డికి బొకే అందజేస్తున్న సమాచార హక్కు చట్టం కార్యకర్తలు

ఉయ్యూరు, సెప్టెంబరు 13 : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి సేవలు ఎనలేనివని సమాచార హక్కు చట్టం కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ కొనియాడారు. లక్ష్మణ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం కర్నూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్, సమాచార హక్కు చట్టం కార్య కర్తలు పాల్గొని పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బయ్యారపు దుర్గాప్రసాద్, బొల్లా శివపార్వతి, సిరివెళ్ల గౌరి పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

● కొన్ని గ్రామాల్లో తేరుకున్న వరి పంట



రంగన్నగూడెంలో వరద ముంపునకు గురైన మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో భవానితో సర్పంచ్ రంగామణి, ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 13 : వర్షాలతో పాటు వరద వల్ల ముంపునకు గురైన పంట కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి జె.భవాని హామీ ఇచ్చారు. రంగన్నగూడెంలో వరద ముంపునకు గురైన మినుము, వరి పంటలను శుక్రవారం క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గ్రామ సచివాలయ పరిధిలోని వీఏఎలు పంట నష్టం అంచనాలను రూపొందిస్తున్నారని, రోజుల వ్యవధిలోనే నష్టపోయిన రైతుల వివరాలు సచివాలయ నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రస్తుత తమ వద్ద ఉన్న గణాంకాల ప్రకారం వరి 1885 హెక్టార్లలోను, మినుము 240 హెక్టార్లలో పంటనష్టం ఉందని వివరించారు. బొమ్ములూరు, కొయ్యూరు తదితర మెట్టప్రాంత గ్రామాల్లో కొంత మేరకు ముంపు వాటిల్లినా వరి పంట తేరుకుందని, సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడి చేతికి వస్తుందని తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

కంకిపాడు మండల సమావేశంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి

కంకిపాడు, సెప్టెంబరు 13 : వరదల కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వరద కారణంగా మండలంలోని పలు గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంట పొలాల వివరాలు తక్షణం సేకరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి. అనూష, సూపరింటెండెంట్ భాస్కర్, జూనియర్ అసిస్టెంట్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి



విద్యార్థికి ఆర్థికసాయం అందిస్తున్న అనుమోలు ప్రభాకరరావు

సివిల్స్ విద్యార్థికి ఆర్థికసాయం

పెనమలూరు, సెప్టెంబరు 13 : వరదల్లో ఇంటితోపాటు ఇంట్లోని సివిల్స్ పుస్తకాలు పోగొట్టుకొని దిక్కుతోచని స్థితిలో ఉన్న యువకుడికి అండగా నిలిచారు టీడీపీ తాడిగడప అధ్యక్షులు అనుమోలు ప్రభాకరరావు. పెదపులిపాక శ్రీనగర్ కాలనీకి చెందిన గోగ వెంకటలక్ష్మీనారాయణ హైదరాబాద్‌లోని ఒక కోచింగ్ సెంటరులో సివిల్స్ కోచింగ్ తీసుకొంటున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చి ఇంటి వద్దనే సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. వరదలు రావడంతో అతనికి చెందిన ఇల్లు, ఇంటిలో ఉన్న సివిల్స్ పుస్తకాలు అన్నీ వరదలో కొట్టుకుపోయాయి. ఈ విషయాన్ని గ్రామ టీడీపీ నాయకులు అనుమోలు దృష్టికి తేగా ఆయన పెద్ద మనస్సుతో స్పందించి పుస్తకాల కొనుగోలుకు పదివేల రూపాయలను పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆ యువకుడికి శుక్రవారం అందజేశారు.



జీవితాంతం ప్రజాసేవలోనే..

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కంకిపాడు, సెప్టెంబరు 13 : ప్రజా సేవలో జీవితాంతం శ్రమించిన మహనీయుడు సీతారాం ఏచూరి అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పంచకర్ల రంగారావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తాడంకి నరేష్, వి. శివశంకర్, పి. దుర్గారావు, జి. కుమారి, ఎం. చంటి, ఎం. శ్రీనివాసరావు, రవి, వి. మరియదాసు, వి. జాన్ మోజెస్, జోజి, వి. నాగేశ్వరరావు, సీహెచ్ వి రెడ్డయ్య, కె. నాంచారయ్య, పి. నాగేశ్వరరావు, పి. సాంబశివరావు, వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : అనారోగ్యంతో బాధపడుతూ ఢిల్లీలో గురువారం మృతి చెందిన కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరికి తాడిగడప సీఐటీయూ నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు, సీఐటీయూ నాయకులు, మహిళా సంఘం నాయకులు, డీవైఎఫ్ఐ యువజన సంఘం నాయకులు ఉన్నారు.

డాక్టర్ రాజారావుకు ఘన నివాళి

ప్రజానాట్య మండలి వ్యవస్థాపకుడు, ప్రజా కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావు వర్ధంతి కార్యక్రమం పోరంకిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ మాట్లాడుతూ, తిరోగమన భావజాలాన్ని మతం, కులం పేరుతో నింపుతున్న నేడు కళ ప్రజల కోసం, ప్రగతి కోసం అనే లక్ష్యాలతో కళాకారులు ప్రజలను చైతన్యవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనుమోలు ప్రభాకరరావు మాట్లాడుతూ, నేటియువత వ్యసనాలకు బానిసవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కంకిపాడు నాయకులు, ఉయ్యూరులో..

ఈ కార్యక్రమంలో నార్నె వెంకటరావు, గాదె సుబ్బారెడ్డి, షేక్ ఖాసీం, సత్య నారాయణ, పాపారావు పాల్గొన్నారు.

ఉయ్యూరు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పీడిత, తాడిత అణగారిన వర్గాలకు, పార్టీకి తీరనిలోటని రిటైర్డ్ ఎంఈవో కొలుసు విశ్వమోహన్ అన్నారు. స్థానిక శ్రామిక భవన్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకుడు రత్నం భాస్కర్‌రావుతో కలసి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోసూరి శివనాగేంద్రం, పార్టీ నాయకులు అన్నే సుబ్బారావు, అట్లూరి రామచంద్రరావు, తోమాటి లక్ష్మణరావు, బి. కోటేశ్వరరావు, టి. చంద్రమౌళి,దేవరపల్లి అజయ్, పట్టణ కార్యదర్శి బి. రాజేశ్, మండల కమిటీ సభ్యులు నిమ్మాది ప్రశాంతి, ఎం.నాగమణి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరికి బండారుగూడెం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో సీపీఎం నాయకులు బర్రె లెనిన్, బొకినాల రాము, పామర్తి అప్పయ్య, రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని పెదఅవుటపల్లిలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి కె.జ్యోతి. మహిళా సంఘం మండల కార్యదర్శి వెంకటరమణ, మండల కమిటీ సభ్యులు కె.రామరాజు (చిన్నబాబు), పార్టీ సభ్యులు ఎస్.కోటేశ్వరరావు, ఎస్.నాగమణి, సీహెచ్.మరియమ్మ, కె.వెంకటేశ్వరమ్మ, నక్కా రమణ, మాదు రమాదేవి, రెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



పెదఅవుటపల్లిలో..

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.30

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మచిలీపట్నం టౌన్ : పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేపడుతున్నట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. ట్రాక్టర్లపై నగరంలోని 50 డివిజన్‌లకు, వివిధ గ్రామాలకు మొక్కలను పంపారు. బండి రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించి ప్రసంగించారు. మొక్కలను వివిధ పాఠశాలలు, కార్యాలయాలకు పంపుతున్నామన్నారు. మొక్కలను తీసుకుని వచ్చేందుకు డాక్టర్ రాళ్ళపల్లి వెంకట లక్ష్మణ స్వామి ఆర్థిక సాయం అందించారన్నారు. గడ్డం రాజు, గల్లా తిమోతి, వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం పూర్తి కాకముందే కుంగిన కోడూరు ప్రధాన రహదారి



జయపురం-కొత్తపాలెం గ్రామాల మధ్య కుంగిన రోడ్డు

కోడూరు : నిర్మాణం పూర్తి కాకముందే కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి కుంగింది. కోడూరు - అవనిగడ్డ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావటంతో రూ. 16.80 కోట్ల నిధులు మంజూరు చేశారు. జయపురం - కొత్తపాలెం గ్రామాల మధ్య నిర్మాణం పూర్తి కాకముందే కుంగింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా రోడ్డు నిర్మాణంలో బుసక పోయటమే కారణమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మెరక పనుల్లో భాగంగా బయటి ప్రాంతాల నుంచి మట్టి తీసుకురాకుండా రోడ్డు పక్కనే ఉన్న పంట కాలువలోని గొయ్యి తీసి దానినే వినియోగించడంతో కుంగిపోయిందని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నాణ్యతా ప్రమాణాలు పాటించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వెలివోలు లంక భూములకు ఈ-క్రాప్ నమోదు చేయాలి

చల్లపల్లి : వెలివోలు లంక భూములకు ఈ క్రాప్ నమోదు చేసి రైతులకు పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ డిమాండ్ చేశారు. వెలివోలు శివారు చీడేపూడి లంకలో రైతుసంఘం నాయకులతో కలిసి పర్యటించారు. నష్టపోయిన మల్బరీతోటలను, పంటలను పరిశీలించారు. లంక భూములు ఆన్‌లైన్ జరగకపోవటంతో ఈ క్రాప్ నమోదు కాలేదని రైతులు చెప్పటంతో సమస్యపై చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరారు. ఉన్నతాధికారులకు సమస్య వివరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ, వెలివోలు లంకలో 137 మంది రైతుల భూములకు ఈ క్రాప్ చేయాలని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, రైతుసంఘం నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, గుత్తికొండ రామారావు, ఆట్లూరి వెంకటేశ్వరరావు, మాలెంపాటి కోటేశ్వరరావు, పెనుమత్స ప్రభాకరరావు, రాజారత్నం రైతులు పాల్గొన్నారు.

రైతులను వీడని ముంపు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే కైలే



అయ్యంకిలో రైతులతో మాట్లాడుతున్న కైలే అనిల్ కుమార్

కూచిపూడి : వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయ్యం కి, చినముత్తేవి, ఆవిరిపూడి, కాజ, కోసూరు, పద్దారాయుడుతోట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వేలాది రూపాయలు రైతులు పెట్టుబడి పెట్టి ఉన్నారని, నిబంధనలు సడలించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, పార్టీ నేతలు రాజులపాటి రాఘవరావు, నాగనబోయిన సునీల్, కొండవీటి అమల బాలేశ్వరరావు, మం దా శ్రీనివాసరెడ్డి, గోగినేని పెరుమాళ్లు, ఏనుగ మోహనరావు, తాతా స్వప్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం : ఎమ్మెల్యే కుమార్ రాజా

ఐనంపూడి (పమిడిముక్కల) : వర్షాలు, వరదలకు పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా భరోసా ఇచ్చారు. ఐనంపూడిలో శుక్రవారం పర్యటించి పంట నీటమునిగి నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పంట నష్టం లెక్కలు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జక్కా శ్రీనివాసరావు, లింగంనేని బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



కూచిపూడి : నిడుమోలు ఎస్టీ కాలనీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. వరదల కారణంగా ఎస్టీ కాలనీ నీటమునగటంతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సత్వరమే రేషన్ అందించాలని అధికారులను ఆదేశించారు. లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, గొంతుపులి రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

135 మంది మహిళా పోలీసుల బదిలీ

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులకు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఆర్ గంగాధరరావు పర్యవేక్షణలో బదిలీ కౌన్సెలింగ్‌ను శుక్రవారం నిర్వహించారు. దివ్యాంగులు, స్పౌజ్‌కోటా, పరస్పర అంగీకార బదిలీలు, ఆరోగ్యపరమైన సమస్యలు తదితరాలలో నిబంధనలకు అనుగుణంగా కౌన్సెలింగ్ పద్ధతిలో 135 మంది బదిలీ జాబితా సిద్ధం చేశారు. బదిలీలకు సంబంధించిన జాబితాను కలెక్టర్ అనుమతికోసం పంపుతామని,అనుమతి వచ్చిన వెంటనే బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను అందజేస్తామని ఎస్పీ తెలిపారు.



దక్షిణ చిరువోలులంకలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ఎదురుమొండి మత్స్యకారులకు సరుకులు, దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మండలి



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

రైతులను తక్షణం ఆదుకోవాలి

- ఎకరానికి రూ.20 వేలు ఇవ్వాలి ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్
- వరద బాధితులకు మోదుమూడి కుటుంబం, ఐవీఎం సహా పలు సంస్థల సాయం

అవనిగడ్డ, సెప్టెంబరు 13 : వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. దక్షిణ చిరువోలు లంక గ్రామంలో శుక్రవారం మోదుమూడి కుటుంబం ఆధ్వర్యంలో వరద బాధితులకు రూ.1.50లక్షల విలువైన దుప్పట్ల పంపిణీని రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేలు తక్షణ సాయం అందించాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవటానికి మోదుమూడి కుటుంబం ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సిహె చ్.కోటేశ్వరరావు, ప్రొగ్రెసివ్ ఫోరం రాష్ట్ర నాయకుడు అక్కినేని చంద్రరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, మహిళా సమైఖ్య నాయకురాలు సిహెచ్.దుర్గ, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు మోదుమూడి రామారావు, చేనేత సంఘ కార్మిక నాయకులు కోదాటి నారాయణరావు, లింగం ఫిలిప్పు, వై.ఈశ్వరరావు, గ్రామపంచాయతీ సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం, మోదు మూడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, దక్షిణ చిరువోలులంక వరద బాధితులకు అవనిగడ్డ అర్బన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మేడిలంక ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కమ్మిలి సుబ్రహ్మణ్యం, కొట్టే విజయ్, రఘునాథ్ ప్రసాద్, జమాల్, బాలకోటి పాల్గొన్నారు. **నాగాయలంక** : ఎదురుమొండి దీవుల్లో పూర్తిగా కోతకు గురైన గొల్లమంద - జింకపాలెం రోడ్డు శాశ్వత పునర్నిర్మాణ కార్యక్రమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్ తెలిపారు. వరద ముంపునకు గురైన 90 మత్స్యకార కుటుంబాల వారికి పులిగడ్డ ఐవీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1.90 లక్షల విలువైన నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఐవీఎం ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ వేముపల్లి సురేష్ - రోజా దంపతులను అభినందించారు. తహసీల్దార్ హరనాథ్‌బాబు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్థిరావు (నాని), తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, కూటమి నాయకులు లకనం నాగాంజనేయులు, బోనం పాపారావు, నాగిడి తాతారావు, భోగా ది శివ విష్ణువర్థన్, బండ్రెడ్డి మల్లిఖార్జున్, బండ్రెడ్డి హరి, లేబాక కొండలు, పెదపాలెం సర్పంచ్ దున్న రాజేష్, శ్రీరామపాదక్షేత్రం ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : పాత ఎడ్లంక వరద బాధితులకు మొవ్వ, ఘంటసాల, అవనిగడ్డ, చల్లపల్లి మండలాల ఉపాధ్యాయులు రూ.1.10 లక్షలు సేకరించి ఆ మొత్తంతో ఆరు రకాల నిత్యావసర సరుకులు 420 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ.వి.రామారావు, జిల్లా కార్యదర్శి ఆలూరి సురేష్, వినీల, బేతులు చర్చి పాస్టర్ బొండాడ పాల్ మేయర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పాత ఎడ్లంక పల్లెపాలెంలో 160 మంది వరద బాధిత కుటుంబాలకు హైదరాబాద్ పోతరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.75 వేల తో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు పోతరాజు భాస్కర రావు, జనసేన మండల అధ్యక్షులు గుడివాక శే షుబాబు, ఉపాధ్యక్షులు తుంగల నరేష్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనగాల సత్యనారాయణ (సత్యంబాబు), కమ్మిలి సాయి భార్గవ, వడుగు రవికుమార్, సింహాద్రి బుజ్జి, జనసైనికులు పాల్గొన్నారు.

పశువులకు పచ్చగడ్డి...

అవనిగడ్డ రూరల్ : పాత ఎడ్లంకకు చెందిన పశువులకు మోపిదేవి మండలం శివరామపురం, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు ట్రాక్టర్ పచ్చగడ్డిని శుక్రవారం అందజేశారు. పచ్చగడ్డి అందించిన సుఖవాసి సురేష్ బాబు, మిత్ర బృందానికి పాత ఎడ్లంకకు చెందిన దోవా గోవర్ధన్, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. రావి వీరయ్య, మేకా రాధాకృష్ణ శివ ప్రసాద్, కంఠమనేని మను పాల్గొన్నారు.



సాంబశివరావు మాస్టారుకు సర్వేపల్లి జాతీయ పురస్కారం ప్రదానం

చల్లపల్లి : చల్లపల్లి రాజా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు మాస్టారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య, లయన్ పి.ఉమాశంకరరెడ్డి, వెంకటాచారి చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.. సర్వేజనా సుఖినోభవంతు సంస్థ వ్యవస్థాపకులు .సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యతేజ తదితరులు సాంబశివరావుకు అభినందనలు తెలిపారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. పద్మావతి కళాశాలలో జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రు లు కష్టపడి శ్రమకోర్చి నమ్మకంతో కళాశాలకు పంపుతున్నారని, వారి ఆశలను వమ్ము చేయకుండా ముందుకు సాగాలన్నారు. చెడు అలవాట్లు, స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. బ్యాడ్ టచ్, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే 100, 112కు డయల్ చేయవచ్చన్నారు. మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ ఎండి మస్తాన్‌ఖాన్, ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి తదితరులు మాట్లాడారు.



పవర్ లిఫ్టింగ్ విజేత మురళీకృష్ణకు సత్కారం

మచిలీపట్నం టౌన్ : కఠోర శ్రమతోనే విజేతగా నిలవడం సాధ్యమని ఆర్డీఓ ఎం వాణి అన్నారు. అంతర్జాతీయ 59 కిలోల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం సాధించిన దోనే మురళీకృష్ణ సన్‌స్టార్ స్కూల్‌లో ఘనంగా సత్కరించారు. సన్‌స్టార్ మెంటార్ పి.శ్రీరాం, బెరాకా మినిస్ట్రీస్ అధినేత బ్రదర్ కిరణ్‌పాల్ తదితరులు మురళీకృష్ణకు నగదు ప్రోత్సాహకం అందించి సత్కరించారు. ఆర్డీఓ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా గ్రంథాలయ సంసంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, తహసీల్దార్లు శ్రీనివాస్, మధుసూధనరావు , కార్పొరేటర్ దేవరపల్లి అనిత , అయ్యప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.



నిరంజన్ రావు, ఉదయభానులను సత్కరిస్తున్న జనసేన నాయకులు


ఉత్తమ సేవకులకు సత్కారం

కోడూరు : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రేపల్లె నిరంజన్‌రావు, జిల్లా ఉత్తమ లైన్‌మెన్ అవార్డు పొందిన చిప్పల ఉదయభానులను ప్రముఖ పారిశ్రామిక వేత్త లంకే ప్రసాదరావు ఆధ్వర్యంలో సత్కరించారు. వేణుగోపాలపురం పాఠశాలలో శుక్రవారం నిరంజన్ రావును, ఉదయభానును సత్కరించి అభినందించారు. ఈ జనసేన పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అందరూ మొక్కలు నాటాలి

మచిలీపట్నం టౌన్ : పర్యావరణ పరిపరిరక్షణకు అందరూ మొక్కలు నాటడంపై దృష్టి సారించాలని నార్త్ తహసీల్దార్ కె శ్రీనివాస్ అన్నారు. 45వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సీడీపీవో కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ శ్రీనివాస్ మొక్కలు నాటారు. కార్పొరేటర్ దేవరపల్లి అనిత ,రూరల్ ఎస్సై నాగరాజు, సచివాలయం అడ్మిన్ షేక్ అల్లా బక్షు, టీడీపీ నాయకులు కొనకళ్ల భాను, గంజాల రవి అగస్త్యేశ్వరరావు, కూనపరెడ్డి రామశేషారావు తదితరులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమ పూజలు

నాగాయలంక : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు మండలంలోని సంగేగడ్డ గ్రామంలో వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు శుక్రవారం ఉత్సవ పందిరిలో 70 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలను అర్చకులు శాస్త్రి నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను నిర్వాహకులు పంపిణీ చేశారు.

లక్ష్మీపురంలో అన్నదానం

చల్లపల్లి : లక్ష్మీపురంలో గణపతి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. యువనేత మండలి వెంకట్రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకట్రామ్‌కు వేద పండితులు, కమిటీ పెద్దలు ఆయనను సత్కరించారు.



సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు

మచిలీపట్నం టౌన్ : సీపీఎం కేంద్ర కమిటీ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు అన్నారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. **పెడన** : సీతారాం ఏచూరి చిత్రపటానికి. సీపీఎం నాయకులు గోరు రాజు, వాసా గంగాధరరావు, పంచల నరసింహారావు, ఉట్ల పేరయ్యలింగం నివాళులర్పించారు. **కోడూరు:** మతోన్మాదంపై రాజీలేని పోరాటం చేసిన పోరాట యోధుడు సీతారామ్ ఏచూరి అని మండలం సీపీఎం కార్యదర్శి పోలాబత్తిన మోహనరావు అన్నారు. కోడూరులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆవుల బసవయ్య, తాతయ్య, రేపల్లె యోగ ప్రకాష్, బాలగోపాల రామకృష్ణరాజు, నిండు వెంకట కృష్ణారావు, బత్తిన రాజగోపాల్, ఘంటసాల ప్రసాద్, కాగిత సుదర్శన్, తమ్ము రత్తయ్య పాల్గొన్నారు

సిద్ధేశ్వరస్వామి పంచలోహ విగ్రహాలకు శ్రీకారం

గుడ్లవల్లేరు : గంగాపార్వతీ సమేత సిద్ధేశ్వ ఆలయంలో ఉత్సవమూర్తులకు 150 సంవత్సరాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో నూతన పంచలోహ విగ్రహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అభిషేకాలు, హోమం నిర్వహించి ఆలయ ప్రాంగణంలో నే ఉత్సవ మూర్తుల నూతన పంచలోహ విగ్రహాలకు అచ్చు పోసే కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహాల తయారీకి గ్రామంలోని భక్తులు వెండి, బంగారం సమర్పించారు. ఆలయ ఛైర్మన్ కొసరాజు వెంకటాద్రి(పెదబాబు), అన్నే ప్రసాదరావు, వీరభద్రరావుదంపతులు, కోగంటి రాధాకృష్ణ, క్యాటరింగ్ నాగరాజు దంపతులు, కొసరాజు రవి కులుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

రైతుల జాబితాలు సిద్ధం

గుడ్లవల్లేరు : మండల పరిధిలో 33 శాతం మేర పంట నష్టం అంచనా వేసినట్టు మండల వ్యవసాయాధికారి సునీల్ తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో పెట్టామన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 16వ తేదీలోగా తెలియజేయాలన్నారు. **పామర్రు** : పంట నష్టపోయి రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామని, అభ్యంతరాలుంటే ఈనెల 16వ తేదీలోపు అందజేయాలని పామ ర్రు మండల వ్యవసాయాధి వి. శివనాగరాణి అన్నారు. రైతుల జాబితాను రైతు సేవా కేంద్రంలో ఏడీఏ బి.స్వర్ణలత ప్రదర్శించారు. ఏవో గూడపాటి శ్రీదేవి, వీఏఏలు కిరణ్, స్రవంతి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి సేవలో మండలి

అవనిగడ్డ : లక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరావు, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, అర్చక స్వాములు బి.వేణుగోపాలాచార్యులు, దీవి రఘు, అప్పలాచార్యులు, డి.వి.ఎస్.కృష్ణ, దీవి నరసింహమూర్తి తదితరులు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరించారు.

అగ్నిబాధిత కుటుంబాలకు సాయం

కూచిపూడి : కాజలో అగ్నిబాధిత ఆరు కుటుంబాల వారికి ఉయ్యూరుకు చెందిన ఉషా డిజైనర్స్ అధినేతలు ఆలపాటి ఝాన్సీరాణి, ఉషారాణి దుస్తులు, నిత్యావసరాలు, వంట పాత్రలు అందజేశారు. శీలం నారాయణ రావు, జోగి నవ్య, తాడంకి నరేష్, అవినాష్, మురహరి, కాకి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం నేడు

పెడన : పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ళ బాబూరావు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి శిబిరాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.